నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com

రెండో రోజు మూడు నామినేషన్‌లు

గ్రాడ్యుయేట్ స్థానానికి 2, టీచర్స్ స్థానానికి 1

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో గ్రాడ్యుయేట్ స్థానానికి ఇద్దరు, టీచర్ స్థానానికి ఒక్కరు నామినేషన్లు వేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఛాంబర్లో నామినేషన్లను స్వీకరించారు. కాగా ఇప్పటి వరకు మొత్తం 8 మంది గ్రాడ్యుయేట్ స్థానానికి, నలుగురు టీచర్ స్థానానికి నామినేషన్ వేశారు. గ్రాడ్యుయేట్, టీచర్ స్థానాలకు కలిపి మొత్తం 12 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

'డబుల్' ఇండ్లు స్వాధీనం

- తాళాలు పగుల గొట్టి గృహప్రవేశం
- నిర్మాణం పూర్తయినా తమకు ఇండ్లు కేటాయించడం లేదంటూ స్వచ్ఛందంగా తాళాలు వేసుకున్న పలువురు మహిళలు

వివరాలు మెయిన్‌లో..



నవతెలంగాణ-మోర్తాడ్

డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తయినా తమకు ఇండ్లు కేటాయించడం లేదని విసిగెత్తిన పలువురు మహిళలు.. ఇండ్ల తాళాలు పగులగొట్టి స్వాధీనం చేసుకొని గృహప్రవేశం చేశారు. అనంతరం తమ తాళాలు వేసుకున్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఏండ్లు గడుస్తున్నా అధికారులు తమకు ఇండ్లు కేటాయించడం లేదని మండిపడ్డారు.

రైతు భరోసా, రేషన్ కార్డు.. ప్రస్తుతం ప్రజల నోళ్లల్లో నానుతున్న పథకాల పేర్లు. ఏ ఇద్దరు కలిసినా.. నీకు రేషన్ కార్డు వచ్చిందా.. రైతు భరోసా డబ్బులు పడ్డాయా అన్న చర్చే నడుస్తోంది. మిగతా పథకాల కంటే వీటిపైనే ఎక్కువగా మాట్లాడుకుంటున్న పరిస్థితి. అనేక తేదీలు ప్రకటించిన తర్వాత.. ఈసారి నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో పడతాయని, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ రైతు కూలీ ఆత్మీయ భరోసాను సైతం అమలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ ఆ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో ప్రజలను కలిసేందుకు కాంగ్రెస్ నాయకులు పడే తిప్పలు అంతా ఇంతా కాదు. ఎక్కడ కలిసినా పథకాలపై ప్రశ్నల వర్షం కురుస్తుంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధమయ్యేందుకు ప్రజల్లోకి ఎలా వెళ్లాలో తెలియక మదన పడుతున్నారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు జవాబు లేక వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

-నవతెలంగాణ, మోపాల్



ప్రజల్లోకి ఎలా వెళ్దాం..?

కాంగ్రెస్ నాయకుల పరిస్థితి అగమ్యగోచరం

- రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇంకా అందకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- గ్రామాల్లోకి నాయకులు వస్తే నిలదీతల పర్వం
- పేపర్‌ముక్కలు చేతిలో పెట్టారంటూ మండిపడుతున్న లబ్దిదారులు



పథకాలు ఎన్ని అమలు చేస్తున్నా.. అందరి దృష్టి మాత్రం రైతు భరోసా, రేషన్ కార్డులపైనే ఉంది. రైతు భరోసాతో పంటకు పెట్టుబడికి సాయం అందింతే ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కొచ్చని రైతులు భావిస్తున్నారు. కొత్త రేషన్ కార్డు కోసం సైతం వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. రేషన్‌కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు అమలు అయ్యే అవకాశాలు ఉండటంతో వాటి రాకకోసం కండ్లల్లో ఒత్తులు వేసుకొని మరీ ఎదురుచూస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 26 నుంచి రైతు ఖాతాలో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని, రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటించి గణతంత్ర దినోత్సవం రోజున లాంఛనగంగా పథకాల అమలును ప్రారంభించారు. అంతకుముందు గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం రోజున మండలానికి ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకొని పథకాల అమలును లాంఛనంగా ప్రభుత్వం ప్రారంభించింది. కాగా లిస్టులో ఉన్న వారిని పిలిచి పథకాలు మంజూరైనట్టు వారికి పేపర్‌లు ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. తర్వాత పథకాల జాడే లేకుండా పోయింది. ఇందిరమ్మ ఇండ్లపై ఆశ లేకున్నా.. రైతు భరోసా, రేషన్ కార్డుల కోసం లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు.

అయితే రైతు భరోసా డబ్బులు ఇప్పటికీ ఖాతాల్లో పడకపోగా.. రేషన్ కార్డులు ఎప్పుడు వస్తాయో చెప్పే దిక్కు లేదు. అధికారులను అడిగితే పై నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేవని చెబుతు న్నారు. దరఖాస్తులు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా స్వీకరించారు.



ప్రజలను కలిసేందుకు నాయకుల తంటాలు

ప్రభుత్వం హామీలు ఇస్తూ అమలు చేయకపోవడంతో గ్రామాల్లో ఉండే కాంగ్రెస్ లీడర్ల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ప్రజల్లోకి వెళ్తే.. పథకాల అమలుపై నిలదీతలు కొనసాగు తున్నాయి. బయటకు రాకపోతే తమ రాజకీయ భవితవ్యం, స్థానిక సంస్థల్లో అవకాశాలు దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో ఎటూ పాలుపోని స్థితిలో నిమ్మకుండిపోతున్నారు. నాయకులు కనపడితే చాలు.. ప్రశ్నలు ఎదురవుతున్నాయి. మరికొందరైతే ఒక అడుగు ముందుకేసి గత పాలన బాగుండేది అంటూ నాయకుల ముఖంపైనే విమర్శలు చేస్తున్నారు. ఒక పక్కన మన ప్రభుత్వం ఉందని సంతోషపడాలో లేక గ్రామాల్లో పరిస్థితి బాగా లేక బాధపడాలో అర్థం కాలేని అయోమయ స్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగాలో, ప్రజలను ఏ విధంగా కలవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ప్రత్యర్థి పార్టీలు ప్రభుత్వం పైన రోజు ఒక రూపంలో విమర్శలు చేస్తూ ఉన్నాయి. ప్రభుత్వ పరిస్థితి చెప్పేది ఆకాశమంత చేసేది గోరంత అనే విధంగా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ స్థానిక సంస్థల లోపు రైతు భరోసా రాకపోతే కాంగ్రెస్ నాయకుల పరిస్థితి అగమ్య గోచరమే.

ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు

- లింగనిర్ధారణ పరీక్ష చట్టం జిల్లా సలహా కమిటీ సమావేశంలో నిర్ణయం
- నవతెలంగాణలో వరుస కథనాల ఎఫెక్ట్


సమావేశమైన కమిటీ

నవతెలంగాణలో వచ్చిన కథనం


అడ్డుకుంటున్నా.. ఆగట్లే

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలో వెళ్లూనుకున్న లింగనిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇక నుంచి స్కానింగ్ సెంటర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు జోరుగా జరుగుతున్నట్టు నవతెలంగాణలో వరుస కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో మంగళవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష చట్టం జిల్లా సలహా కమిటీ సమావేశం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించుటకుగాను చేపట్టు చర్యలపై ప్రధానంగా చర్చించారు. జిల్లా లోని అన్ని స్కానింగ్ కేంద్రాలను ప్రోగ్రాం అధికారి ఆకస్మిక తనిఖీలు చేస్తూ నివేదికలు అందించాలని కమిటీ సభ్యులు సూచించారు. మండల స్థాయిలో వైద్యాధికారులు , పర్య వేక్షక సిబ్బంది ఆశాలు , ఆరోగ్య కార్యకర్తలు లింగ వివక్ష పట్ల క్షేత్ర స్థాయి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిచాలని , లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ కేంద్రాలను గుర్తించి చట్ట పరమైన చర్యలు చేపట్టాలని , ప్రతి స్కానింగ్ కేంద్రం జిల్లా అథారిటీ లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా కఠిన నిబంధనలు అమలు చేయాలని ఇట్టి సలహా కమిటీ లో తీర్మానాలు చేశారు.

ఈ సమావేశంలో డాక్టర్ చంద్రశేఖర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి , న్యాయ నిపుణులు ఎం సంతోష్ కుమార్ , న్యాయవాది , జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ అధికారి ఎన్ భీమ్ కుమార్ , ప్రోగ్రాం అధికారి డా.అనురాధ , సఖి కోఆర్డినేటర్ భారతి , ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శిరీష , డాక్టర్ రేఖ , మాస్ మీడియా అధికారి వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను డిఎంహెచ్‌వో రాజశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి రిజిస్టర్లను తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఫాతిమా ఫిర్దోస్, డాక్టర్ ప్రవీణ్, ఆనంద్, ఎల్ టి కృష్ణ, ఫార్మసిస్టు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిస్కూల్‌లో ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా జిల్లాలో అమలు చేస్తున్నట్టు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణలోనే మొట్టమొదటి సారిగా ప్రతి పాఠశాల నుండి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమించినట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు పోక్సో చట్టంపై ఒక రోజు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియమించబడిన ప్రొటెక్షన్ ఆఫీసర్ పాఠశాలలో పిల్లల పట్ల ఎటువంటి లైంగిక దాడులకు గురి కాకుండా వాటిని ప్రారంభ దశలోనే అణిచివేసే క్రమంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందనీ వీటిలో భాగంగా జిల్లాలో ప్రతి స్కూల్ నుండి ఒకసారి ప్రొటెక్షన్ ఆఫీసర్, హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపల్‌ను సెలెక్ట్ చేసి వారికి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్ రోల్ పైన సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ చిల్డ్రన్స్ ఇన్ స్కూల్ కాన్సెప్ట్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వ హించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మొట్టమొదటగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కామారెడ్డి లో ఉన్న అన్ని రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ కి యునిసేఫ్ వారి సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో చట్టం, ఆ చట్టంలో నిర్దేశితమైన బాధ్యతలు వివరించారు. పాఠశాలలలో సమస్యలు తలెత్తినప్పుడు వాటిని సమర్థవంతంగా పరిష్కరించే పరిజ్ఞానం హెడ్ ఆఫ్ ది ఇన్స్టిట్యూషన్స్ కి ఉండాలనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.

అనంతరం జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ విద్యాబోధన ఒకటే కాదని, పిల్లల బాగోగులు చూడాల్సిన బాధ్యత కూడా ఉందని అన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన వారు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనేవి తెలిసి ఉండాలని అన్నారు. పిల్లల పట్ల లైంగిక దాడులు జరుగకుండా ప్రొటెక్షన్ అధికారి పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సి. డబ్ల్యూ.సి. మెంబర్ స్వర్ణలత, యునిసెఫ్ రిసోర్స్ పర్సన్ డేవిడ్ రాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.

ముందు పెండింగ్ పారితోషికం చెల్లించాలి

- ఆ తర్వాతే ఆశాలతో కొత్త సర్వేలు చేయించాలి
- సీఐటీయూ డిమాండ్.. వైద్యాధికారికి వినతి

నవతెలంగాణ-నిజామాబాద్(సిరికొండ)


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశాలు

ఆశాలకు లెప్రసి, పల్స్ పోలియో కార్యక్రమాల పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతే.. కొత్త సర్వేలు చేయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సిరికొండలో ఆశా వర్కర్ల సమస్యలపైన మెడికల్ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నూర్జహాన్ మాట్లా డుతూ ఫిబ్రవరి నుండి జిల్లా వ్యాప్తంగా లెప్రసి సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు చెబుతున్నా రని, కానీ పెండింగ్‌లో ఉన్న డబ్బులు చెల్లించిన తర్వాతే సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. 2023లో లెప్రసీ డబ్బులు, 2024లో నిర్వహించిన పల్స్ పోలియో డబ్బులు ఇప్పటికీ ఆశాలకు అందలేదని తెలిపారు. ఈ అంశమైన సంబంధిత కమీషనర్ ఆఫీస్‌లో సంప్రదిస్తే సర్వే కంటే ముందే డబ్బులు చెల్లించామని చెబుతు న్నారని, కానీ ఇక్కడ జిల్లా స్థాయిలో డబ్బులు రాలేవని, కేవలం ప్రొసీ డింగ్స్ మాత్రమే వచ్చాయని అంటున్నారని తెలిపారు. మరి నిధులు ఏమైపోయినట్టు అని ప్రశ్నించారు.

ఇప్పటికే పనికితగ్గ వేతనం అమలు కాక, ఫిక్స్‌డ్ వేతనం లేక ఆశాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బం దులు పడుతున్నట్టు తెలిపారు. ఏండ్ల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తూ, ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసి సర్వే చేయాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. కావున పై అంశాలు పరిశీలించి, వెంటనే పరిష్కారం కోసం కృషి చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించి ఆశాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు రాధా, సువర్ణ, లక్ష్మి, గంగామణి, విజయ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం మోహన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మల్యాల సుమన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగుల గోవర్ధన్ రేవతి గంగామణి త్రివేణి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీకి రానందుకు రూ.5 వేల జరిమానా

- చెల్లించలేనందుకు రెడ్డికులం నుంచి బహిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న రాంరెడ్డి

పంచాయితీకి వెళ్లనందుకు రూ.5 వేలు జరిమానా విధించారని, అది కట్టలేని స్థితిలో ఉన్నామంటే సుమారు 13 నెలలుగా తమ రెడ్డి కుల సంఘం నుంచి తమను బహిష్కరించారని తాడ్వాయికి చెందిన సుర్కంటి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన కొడుకు ప్రకాష్ రెడ్డితో కలిసి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. తమ బంధువులతో గొడవ కారణంగా 2023 డిసెంబర్‌లో రెడ్డి సంఘంలో పంచాయితీ పెట్టారన్నారు. ఆ పంచాయితీకి తాము వెళ్లకపోయినా రూ.5 వేలు కట్టాలని అడగడంతో తాము చెల్లించలేదన్నారు. దీంతో తమను బహిష్కరించి 13 నెలలుగా శుభకార్యాలకు, ఏ ఇతర కార్యక్రమాలకు పిలవడం లేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసినా కులసంఘ సభ్యులు వినడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అంకితభావంతో విధులు నిర్వహించి

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఎడపల్లి/బోధన్



ఎడపల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్.. బోధన్‌లో పోలింగ్ కేంద్రం పరిశీలన

వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు రాజీవ్ గాంధీ సూచించారు. మంగళవారం ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీ లించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న వైద్య చికిత్సలపై వాకబు చేశారు. ప్రతి రోజు ఎంత మంది రోగులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఏ.ఎన్.సీ పరీక్షలు చేయాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిని సాయి స్ఫాఫిర్దోస్, ఆయుష్ వైద్య అధికారి వెంకటేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

బోధన్ : శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహశీల్దార్ విఠల్, స్థానిక అధికారులు ఉన్నారు.

కల్యాణలక్ష్మీ నిధులు గోల్‌మాల్

యువతికి పెండ్లైనట్టు పత్రాలు సృష్టించిన వీఆర్‌ఏపై కేసు

నవతెలంగాణ-నసురుల్లాబాద్



యువతికి పెండ్లిఅయినట్టు పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి పథకం డబ్బులు కాజేశాడో వీఆర్ఏ. కాగా తాజాగా సదరు యువతికి పెండ్లై దరఖాస్తు చేసుకోగా.. గతంలోనే మంజూరైనట్టు అధికారులు తెలపడంతో యువతి తండ్రి ఫిర్యాదు చేయగా.. వీఆర్ఏ చేతివాటం వెలుగు జూసింది. ఈ ఘటన బీర్కూర్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామంలో గతంలో అతిమెల గణేష్ వీఆర్ఏగా పని చేశాడు. ఆ సమయంలో వీరాపురం గ్రామానికి చెందిన పవర్ మమత ఉన్నత చదువుల కోసం ఆదాయ ధ్రువ పత్రం కోసం దరఖాస్తు పెట్టుకోగా అదే ఆధార్‌కార్డును ఆసరాగా చేసుకొని, మిగతా పత్రాలు సష్టించి పెళ్లి గాని యువతకి పెళ్లి జరిగినట్లు సృష్టించి కళ్యాణ లక్ష్మి డబ్బులను తన భార్య అతిమెల మమత పేరున ఉన్న ఖాతాకు జమ చేసుకున్నాడు. కాగా గతేడాది డిసెంబర్‌లో సదరు యువతికి పెండ్లి కాగా.. కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకోగా గతంలోనే మంజూరైనట్టు రావడంతో యువతి తండ్రి పవర్ సాంబయ్య అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. తప్పుడు దవీకరణ పత్రాలు పెట్టి తన కూతురుకు రావాల్సిన డబ్బులను కాజేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు కల్యాణలక్ష్మి నిధులు మంజూరు చేయంచాలని కోరుతున్నాడు. కాగా రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోకుండా పైరవీలు జరుపుతున్నట్టు సమాచారం. కాగా పథకాల అమల్లో అవకతవకలకు పాల్పడితే ఎంతటివారైనా చర్యలు తప్పవని బాన్సువాడ సబ్ కలెక్టర్ కుప్పిశెట్టి కిరణ్మయి తెలిపారు.

రైతునేస్తంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-ఏర్గట్ల

జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ మంగళవారం ఏర్గట్ల మండలంలో పర్యటించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం మండలంలోని తాళ్ళ రాంపూర్, ఏర్గట్ల సహకార సంఘాల్లో ఎరువుల సరఫరా వివరాలను పరిశీలించి, సంఘానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏర్గట్లలోని ఓ ప్రదేశంలో పసుపు పాలిషింగ్ చేస్తున్న రైతు వద్ద ఆగి, పసుపును పరిశీలించి, రైతుతో పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మిర్యాల్ గ్రామంలో గడ్డి జొన్న పంటను పరిశీలించి, వారికి సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శేరి వైష్ణవ్, ఏఈఓలు సాయి సచిన్, మనీషా ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండలం కిసాన్ నగర్‌లో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ లయన్స్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రవల్లిక 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ చాకు లింగం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జ్ఞాన సాగర్ రెడ్డి, సభ్యులు దినేష్ పటేల్, వంశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం కాపాడుకోవచ్చు


సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం మాఘ మాసంలో శుక్లపక్షం సప్తమి రోజున రథసప్తమి పండుగ ఉత్సవాలు నిర్వహిస్తారు. భూమిపై ఉన్న సమస్త జీవరాసులు సుభిక్షంగా ఉన్నాయంటే దానికి కారణం సూర్యుడే కారణం అని తెలిపారు. పాఠశాలలో రథసప్తమి పండగ యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తూ 6 వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రాస రవికుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జీ. నర్సారెడ్డి, పిఈటీలు ఎస్.నరేష్, ఐ.గంగాధర్, బీ.సుమలత ఆచార్యులు వై చంద్రశేఖర్, పి.రాజేందర్, వై.వినోద్ కుమార్, మాతాజీలు ఎం.మాధవి, టీ.శ్రీవాణి, బీ,స్వర్ణ, ఎం,దివ్య. ఈ,సంధ్య, డి.జ్యోత్స్న, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై సమావేశం


ఓటర్ల జాబితా పరిశీలనలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వార్డుల వారీగా గ్రామ పంచాయతీలలో ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులపై ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అధ్యక్షతన మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా సప్లిమెంటరీ- 2 జాబితాలో మార్పులు, చేర్పుల వివరాలను పార్టీల ప్రతినిధులకు ఎంపీడీవో వెల్లడించారు. ఈ ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని పార్టీల ప్రతినిధులు సూచించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరినట్లు వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా ప్రంథా నాయకులు సారా సురేష్, ఇతర పార్టీల నాయకులు, మండల పంచాయతీ అధికారి సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం


ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షులు మందుల బాలు మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సకల జనులకు ఆమోదయోగ్యమైన బడ్జెట్ ఆమోదించినందుకు పట్టణ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నివర్గాలకు మేలు జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. రైతు సంక్షేమం కోసం మూడు లక్షల ఉన్న కిసాన్ క్రెడిట్ కార్డును ఐదు లక్షల వరకు పెంచారన్నారు. స్టాటప్ కంపెనీలకు కోటి రూపాయల నుండి రెండు కోట్ల వరకు రుణాలు పొందే అవకాశం కల్పించారని, ఇంకెన్నో వస్తువులపై రేట్లు తగ్గే పరిస్థితి కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కంచేటి గంగాధర్, యామాద్రి భాస్కర్, నూతల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల శీను, , జస్సు అనిల్, కలిగోట గంగాధర్,బ్యావత్ సాయికుమార్,పోల్కం వేణు, పాన్ శీను, బోట్ల విజయ్, కలిగుట ప్రశాంత్, ఉదయ్, శేషగిరి లింగం,మందుల వీరభద్రి, కుక్కునూరు లింగన్న, రాములు, మందుల పోశెట్టి, జల్లి దేవేందర్, అనేక్, మధు, దోండి ప్రకాష్, కృష్ణ గౌడ్, వివిధ మోర్చా నాయకులు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు..

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చెయ్యి

- ఇండియా ప్రజాబంధు పార్టీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చెయ్యి చూపిందని ఇండియా ప్రజాబంధు పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని విమర్శించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ అందరికీ సమాన వాటాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మలమ్మ తన బడ్జెట్ ప్రసంగంలో దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ వారి వ్యాఖ్యలను వాడారని, మరి తెలంగాణ ప్రజలు దేశంలో మనుషులు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా బడ్జెట్లో రాష్ట్రానికి ఏమి తీసుకురాలేదని దుయ్యబట్టారు.

ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన

- రెండు సంవత్సరాలైనా పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థలో శంకుస్థాపన గద్దె

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆనాటి మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చేతులమీదుగా సుమారు రూ.16 లక్షల రూపాయలతో మార్చి 2022లో ముప్కాల్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం 'పల్లె దవాఖాన'కు ఆయ న శంకుస్థాపన చేశారు. ఒకవైపు భవనం పూర్తి అయిన ఇప్పటివరకు 'పల్లె దవాఖాన' ప్రారంభానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు అయోమయంలో ఉన్నారు. ప్రస్తుతం ముప్కాల్ మండల కేంద్రంలో నలుగురు ఆశ వర్కర్లు, ఒకరు ఏఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు వీరు గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ స్థానిక గ్రామస్తులకు వైద్య సేవలను అందిస్తున్నారు. వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి సరైన కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైప ముప్కాల్ మండలానికి ఆరోగ్య కేంద్రం మంజూరు అయిన అనువైన స్థలం లేకపోవడంతో మరో గ్రామానికి వెళ్లే పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు ఎంతో కష్టపడి తెచ్చుకున్న మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో మంజూరైన భవనాలు వేరే గ్రామాలకు వెళ్లే


పల్లెదవాఖాన భవనం



అవకాశం ఉంది. ఇది ఇలా ఉంటే ప్రస్తుతం పల్లె దవాఖాన ప్రారంభానికి నోచుకునేలా మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు శ్రద్ధ వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జనవరి 13న పల్లె దవాఖాన స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభం అవుతుందని గ్రామంలో ప్రచారం జరిగింది. అనంతరం ఆ తేదీ వాయిదా పడింది. ప్రారంభానికి ఆటంకాలు ఏర్పడుతూ రెండు సంవత్సరాలు గడుస్తున్నా 'పల్లె దవాఖాన' ప్రారంభానికి నోచుకోకపోవడంతో స్థానిక గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల రెండోవారంలో జారీ అయ్యే అవకాశం ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతోంది. నోటిఫికేషన్ విడుదల అయితే మళ్ళీ వాయిదా పడుతుందని ఆందోళనలో గ్రామ ప్రజలు ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోని పల్లె దవాఖాన ప్రారంభించాలని కోరుతున్నారు..

దేశానికి పెను సవాల్‌గా క్యాన్సర్

- రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సర్వికల్ క్యాన్సర్ దేశానికి ముఖ్యమైన ప్రజారోగ్య సవాలుగా మారనున్నదని, దీనిని నివారించడానికి ప్రభుత్వం, సామాజిక సేవా కార్యకర్తలు, కృషి చేయాలని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా దాస్ నగర్ లోని మహిళ రెసిడెన్షియల్ కాలేజ్ లో మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన క్యాన్సర్ అవేర్నెస్ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని, మందుల ధరలను నియంత్రించాలని, అప్పుడే నానాటికి పెరుగుతున్న క్యాన్సర్‌ను అరికట్టవచ్చు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ తాను క్యాన్సర్‌ను జయించానని, ముందుగా గుర్తించి క్యాన్సర్‌ను అరికట్టవచ్చని ఆయన అన్నారు. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ప్రమాదకరంగా మారాయని, వాటిని ముందుగా గుర్తించి నివారించుకోవచ్చని, ప్రభుత్వం ఉచితంగా క్యాన్సర్ వ్యాక్సినేషన్ మహిళలకు అందించాలని ఆయన కోరారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి మాట్లాడుతూ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో అనేక క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు తల్లిదండ్రులకు, సమాజానికి క్యాన్సర్ ప్రమాదాన్ని గురించి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్ నందు ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు కే.రామ్మోహన్‌రావు, మదన్మోహన్, ఈవిల్ నారాయణ, అద్దంకి ఉషాన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రోహిత్

పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాలికలు ఉన్నత స్థానానికి వెళ్లడానికి ప్రభుత్వం అందించే సదుపాయలు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు సీడీపీఓ స్వర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ స్వర్ణలత మాట్లాడుతూ.. బాలికల హక్కులు, చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత స్థానానికి వెళ్లడానికి ప్రభుత్వం అందించే సదుపాయలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, హెల్ప్ లైన్స్, లింగ వివక్షతను రూపుమాపాల్సిన ఆవశ్యకత, ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థినులకు వివరించారు. గుడ్ టచ్-బాడ్ టచ్, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం, తద్వారా వాటి వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి, ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు గంగ హంస, డిహెచ్ఈడబ్ల్యూ సౌమ్య, ఐసిపిఎస్ సునీత, అంగన్వాడీ టీచర్స్ పద్మ, శోభ, సరిత, లక్ష్మి, కౌసల్య, ప్రధానోపాధ్యాయులు రాజన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దినేష్ కులాచారి నియామకం పట్ల హర్షం

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి జిల్లా అధ్యక్షునిగా దినేష్ పటేల్ కులాచారిని రాష్ట్ర నాయకత్వం ప్రకటించటం హర్షనీయమని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుండి 50 వేలకు పైగా ఓట్లు వచ్చాయని, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు నిర్విరామ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు పరిశీలించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

వచ్చే స్థానిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు పరిశీలించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ.. మండలంలో 168 వార్డులు న్నాయని ఒక్కో వార్డుకు ఒక్కో గది ఉండేలా చూడాలని అన్నారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సైతం పోలింగ్ కేంద్రాలు పరిశీలించాలని విద్యుత్‌తో పాటు అవసరమైన వసతులు కల్పించేలా చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసిల్దార్ రహీముద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింలు, మండల పంచాయతీ అధికారిని సవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

నీటి కష్టాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాజంపేట్ మండల ఎంపీడీవో రఘురాం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం రాజంపేట్ మండలంలోని ఆర్గొండ, బస్వన్నపల్లి, అన్నారం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించి, 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పైప్ లీకేజ్, వాటర్ ట్యాంకుల పరిశీలన, నీటి సమస్యలను గుర్తించి జాగ్రత్త తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రజిత, కార్యదర్శులు లక్ష్మణ్, స్వాతి, రామ్ నివాస్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మున్ముందు ఉన్నత స్థాయికి చేరాలి

- 25 వసంతాలు జరుపుకోవడం అభినందనీయం
- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగడం నరేష్


కార్యక్రమంలో పాల్గొన్న సీఐ నరేష్, ఎంపీడీవో సంతోష్‌కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ పాఠశాల నెలకొల్పి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందజేసి పలువురు విద్యార్థులు నేడు ఉన్నత స్థాయికి చేరుకున్నారని, 25 వసంతాలు సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపు కోవడం అభినందనీయమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగడం నరేష్, సదాశివ్ నగర్ ఎంపిడిఓ ఎం.సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని జ్ఞాన వాగ్దేవి విద్యాలయం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగడం నరేష్, సదాశివ్ నగర్ ఎంపిడిఓ ఎం.సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈవిద్యాలయంలో చదివిన ఎందరో నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని, మంచి విద్యకు మారు పేరుగా ఈ విద్యాలయం నిలిచిందని అన్నారు. సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా విద్యాలయ యజమానులు ప్రత్యేక కృషి చేస్తున్నారని వారన్నారు. విద్యాలయం ఏర్పాటు చేసినప్పుడు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొనే ధైర్యం పట్టుదలతో మంచి విద్య అందించారని కొనియాడారు. మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ ఆసుపత్రి వైద్యులు డీకొండ అనుదీప్ మాట్లాడుతూ ఎల్ కె జిలో జ్ఞాన వాగ్దేవి విద్యాలయం లో చేరి నేడు ఎంబిబిఎస్ డాక్టర్ అయ్యానని, నేడు చుట్టూ పక్కల ఉన్న గ్రామాల ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందని, కాని ఈ పాఠశాల నుండే ప్రారంభం కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అంతకు ముందు పలువురు విద్యార్థుల డ్యాన్సులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. 26 ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథులతో బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలోఅధ్యక్షులు సిహెచ్ గంగరాజయ్య, కార్యదర్శి ఆర్.రాధిక, కోశాధికారి ఆర్.గంగాధర్, ప్రిన్సిపాల్ బి. ఓంకార చారి, కరస్పాండెంట్ తేలు గంగాధర్, వైస్. ప్రిన్సిపల్ ఎం. ప్రశాంత కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిప్రిలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, యజ్ఞం, అన్నదాన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. పట్టణంలోని సీతారాం జ్యువెలర్స్ యజమాని సుంకం భూషణ్ 10 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కళ్యాణం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో "శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి" 20వ వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్వామి కళ్యాణం, రథోత్సవంను భక్తుల మధ్య అంగరంగవైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు దేశ నర్సయ్య అన్నారు. ఆలయ మహోత్సవాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రం ఏర్పాట్లను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంతో ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి వారిని ముప్కాల్ తహశీల్దార్ గజానన్, సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ రజినీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీకాంత్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్వామి మలాధారణ భక్తులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో గణపతి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలం లోని చేపూర్ గ్రామంలో మంగళవారం మాదిగ పెద్ద సంఘ భవనంలో మాదిగ సంఘ పెద్ద మనుషుల ఆధ్వర్యంలో గణపతి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వీధుల్లో మంగళ హారతులు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా సంఘ భవనానికి తీసుకువెళ్లి గణపతి విగ్రహాన్ని పూజారి పాలకుర్తి కిరణ్ కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిష్టించారు. గుడి నిర్మాణానికి, గణపతి విగ్రహానికి భారీ మొత్తంలో విరాళాలు ఇచ్చిన పూణే శాపూర్ గంగాధర్ సార్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి సహకరించిన కొండ్ర రంజిత్ కుమార్‌ను సంఘ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ పెద్ద మనుషులు మాట్లాడుతూ గుడి నిర్మాణదాత, విగ్రహ దాత పూణే గంగాధర్ సార్ పూర్వీకులు చేపూర్ గ్రామస్తులు కావడం చాలా సంతోషకరమని, పూజా కార్యక్రమంలో సంఘ పెద్ద మనుషులు ఇందూర్ నవీన్, దాసరి శ్రీకాంత్, సాట్ల గంగ సాయన్న, కొనింటి రాందాస్, జన్నపల్లి సాయన్న, దాసరి శ్రీనివాస్, నూత్పల్లి గంగాధర్, బొబ్బిలి సుభాష్, మహిళలు సంఘ సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యుఎస్‌ఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో గల నుడా చైర్మన్ కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కేశవేణు యుఎస్ఎఫ్ఐ 2025 క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశవ వేణు మాట్లాడుతూ.. సామాజిక స్పృహ కలిగినటువంటి విద్యార్థి సంఘాలు సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని, నిరంతరం విద్యార్థి, యువత సమస్యల పట్ల స్పందిస్తూ ఉద్యమించే యువతరాన్ని ప్రోత్సహిస్తానని అన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు శివ, పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారులకు పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని వేల్పూర్ ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. ంగళవారం మండలంలోని లక్కోరా గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్వాడి కేంద్రం రికార్డులను, సరుకులను, పాలు, కోడిగుడ్లను పరిశీలించారు. వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. చిన్నారుల బరువులను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. దీని ద్వారా చిన్నారులు అంగన్వాడి కేంద్రాలకు రావడానికి అలవాటు పడతారన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడి పరిసరాల్లో చెత్తా చెదారం తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నేడు రైతు సదస్సును విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని ఫిబ్రవరి 5న (నేడు) జరిగే రైతు సదస్సును విజయవంతం చేయండి అని చెరుకు ఉత్పత్తి దారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. (ఎన్ సి ఎస్ ఎఫ్) సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం తెరిపించి నడిపించాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ మున్నూరు కాపు కళ్యాణ మండపంలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగే చెరుకు రైతుల సదస్సును విజయవంతం చేయాలని కోరారు.తెలంగాణ సహకార రంగంలో కొనసాగిన ఏకైక చెక్కర ఫ్యాక్టరీ ఎన్సిఎస్ఎఫ్, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో 4 శాసనసభ నియోజకవర్గాల్లో 70 గ్రామాల్లో చెరుకు పెట్టడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీలో 23వేల మంది సభ్యులుగా 8,000 మంది రైతులు రెగ్యులర్గా చెరుకు సప్లై చేసే వారని ఇందులో 6, వేల మంది వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుందని, పర్మినెంట్గా 500 మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీ 99 ఎకరాల విస్తీర్ణంలో ఉందని దీనిని అమ్ముకుంటే 400 నుంచి 500 కోట్ల రూపాయలకు వస్తాయని అమ్ముకుందామని కొందరు రాజకీయ నాయకులు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. వారి ఎత్తులు రైతు ఉద్యమం ముందు పతించలేక చతికిల పడ్డారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంత రైతులకు ఇచ్చిన మాట ప్రకారం చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని వేసిన సబ్ కమిటీ ఈ ప్రాంతంలో పర్యటించి పరిశీలించిందని, మాట నిలబెట్టుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం అని, ఫ్యాక్టరీ తెరిపించుకునేందుకు చెరుకు రైతులు అధిక సంఖ్యలో రైతు సదస్సుకు హాజరుకావాలని కోరారు.

హోటళ్లు, బేకరీల్లో అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కొత్త బస్టాండ్ ఏరియాలో పలు హోటల్లు, బేకరీలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రతపై, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారని మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం తెలిపారు. పలు దుకాణాల ట్రేడ్ లైసెన్స్ ను తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేనివారికి నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హోటల్లు బేకరీలు , ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ లేకుంటే జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ పర్యావరణ, ఇంజనీర్ పూర్ణమౌళి ,వార్డ్ ఆఫీసర్ పృథ్వీరాజ్, సిబ్బంది అక్షయ్, రాము, నరసయ్య, ప్రశాంత్, రవి , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీంపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

షీ టీం బృందం ఆధ్వర్యంలో పట్టణంలోని టీఎస్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు షీ టీం పని చేసే విధానం గురించి మంగళవారం అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, క్యూ ఆర్ కోడ్ ఉపయోగించి ఫిర్యాదు చేసే విధానం, మహిళల చట్టాల గురించి వివరించారు. అలాగే డయల్ 100 ప్రాధాన్యతపై వివరించారు. ఈ సందర్భంగా షీ టీం కరపత్రాలను పంపిణీ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com

మోడల్ హౌస్ నిర్మాణం పనులు త్వరగా చేపట్టాలి

నవతెలంగాణ-తాడ్వాయి

మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మాణం చేపట్టేందుకు మార్కౌట్ చేసిన స్థలాన్ని పరిశీలించారు. హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ డిప్యూటీ ఇంజనీర్లను పనులు త్వరలో చేపట్టాలని చరవాణి ద్వారా ఆదేశించారు. నిర్మాణం పనులు 45 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ రహీముద్దీన్, ఏవో నరసింహులు, ఎంపిఓ సవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

పల్లె ప్రకృతివనం పరిశీలన

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని అచ్చంపేట్, బంజపల్లి గ్రామపంచాయతీలలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, అంగన్వాడీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి శ్రీపతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు అన్ని పెరిగే విధంగా నర్సరీకి నీరు అందించాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలలో గర్భిణులకు, పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

నులిపురుగుల నివారణ మాత్రలను
19 ఏండ్లలోపు వారందరికీ అందించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

నులిపురుగుల నివారణ మాత్రను ప్రతి ఒక్కరికీ అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలు, బడిబయట ఉన్న పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రను ఫిబ్రవరి 10న ఆయా పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో అందించాలని తెలిపారు. జిల్లాలో 15వ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించాలని, గత జూన్ 2024 మాసంలో 1-19 వయస్సు గల 2,58,599 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రను అందించడం జరిగి 102.40 శాతం మందికి అందించామని తెలిపారు. ప్రతీ పాఠశాల, కళాశాలల్లో ఒక నోడల్ అధికారిని నియమించాలని వివరించారు. భోజనం తిన్న తరువాత ఈ మాత్రను పిల్లలకు వేయాలని తెలిపారు. పిల్లలను రక్తహీనత, బరువు తగ్గుదల, తదితర వ్యాధుల నుంచి కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. స్వయం సహాయక బృందాలను సమీకరించాలని అన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 14 రౌండ్ల కార్య క్రమాలు నిర్వహించామని, ఈ నెల 10న 15వ రౌండ్ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 17 మిగిలిపోయిన చిన్నారులకు వేయనున్నట్టు పేర్కొన్నారు. మాత్ర వేసుకున్న తదుపరి వాంతులు జరిగితే వెంటనే వారికి వైద్య సేవలు అందించడానికి డాక్టర్ల బృందం, 102, 108, ఆర్బిఎస్కే వాహనాలను సిద్ధం చేసినట్టు వివరించారు.

ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విద్య మాట్లాడుతూ.. ఈ మాత్ర వేసుకోవడం ద్వారా ఎనీమియా, ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, నోడల్ అధికారులను గుర్తించామని తెలిపారు. అవసరమైన ఆల్బెండజోల్ మాత్రలను సిద్ధంగా సమకూర్చినట్టు చెప్పారు. మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. మాత్ర పంపిణీ రోజున ప్రతీ విద్యార్థి పాఠశాలకు వచ్చేవిధంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గ్రామస్థాయిల్లో టాంటాం నిర్వహించేందుకు పంచాయతీ అధికారులను కోరామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, రెడ్‌క్రాస్ చైర్మన్ రాజన్న, మెప్మా పిడి శ్రీధర్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధి డిపిఎం రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండి జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రక్తదాతల సమూహం 2025 సంవత్సరానికి గానూ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండి జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధిక యూనిట్ల రక్తాన్ని అందజేసిన సంస్థకు పనిచేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించి తలసేమియా చిన్నారుల కోసం, అత్యవసర పరిస్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడం కోసం పనిచేస్తామన్నారు. 2025 సంవత్సరానికి గానూ అధ్యక్షులు జమీల్ హైమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, నిర్వాహకులుగా డాక్టర్ బాలు, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ వేద ప్రకాష్, ఉపాధ్యక్షులుగా గంప ప్రసాద్, వెంకట రమణ, సలహాదారులుగా ఎర్రం చంద్రశేఖర్ కొనసాగుతారని పేర్కొన్నారు.

పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలించిన కార్యదర్శులు



పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న కార్యదర్శులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి, ర్యాగట్లపల్లి, మల్లుపల్లి, ఇసాన్నపల్లి, సిద్ధ రామేశ్వరనగర్, కంచర్ల, కాచాపూర్, రామేశ్వర్‌పల్లి, భిక్కనూర్ ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి ఆదేశాల మేరకు రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్‌స్టేషన్‌లో వాటర్, టేబుల్స్, విద్యుత్, వీల్‌చైర్స్ సౌకర్యాలు పరిశీలించాలని, వసతులు లేనిచోట సౌకర్యాలు కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వాటర్ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో తాగునీరు పైప్‌లైన్ లీకేజ్ కారణంగా నీరు వృథాపోతున్న దానిని గమనించి పంచాయతీ కార్యదర్శి లక్ష్మి మంగళవారం పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతులు పంచాయతీ సిబ్బంది చేత చేయించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులు నీటిని వృథా చేయవద్దని, కాలనీలో నీటి సమస్య ఉంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

అబాకస్ పోటీలో ప్రజ్ఞ పాఠశాల విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉన్న ప్రజ్ఞ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి అక్షయ్ కుమార్ సీనియర్ లెవెల్-4 కేటగిరీలో ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విశ్వం ఎడ్యుకేట్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో విజువలైజేషన్‌లో ర్యాంకు సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అబాకస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి అక్షయ్ కుమార్‌ను పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు, తల్లిదండ్రులు విద్యార్థిని అభినందించి హర్షం వ్యక్తం చేస్తూ జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

బోర్గంలో కామ్రేడ్ యాదగిరి సంస్మరణ సభ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో కామ్రేడ్ యాదగిరి సంస్మరణ సభను సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆధునిక కమ్యూనిస్టుగా యాదగిరి ఐదు దశాబ్దాలుగా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ, విప్లవం ఉద్యమాన్ని నడిపించాడని వారు కొనియాడారు. శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో విప్లవ పోరాట ఉద్యమాన్ని ప్రారంభించి తన ఉద్యోగాన్ని వదులుకొని సమాజంలో మార్పు తీసుకురావాలన్న ఉద్దేశంతో విప్లవం నడిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్ముల గంగాధర్, పుట్టి నడిపి నాగన్న, పార్వతీ రాజేశ్వర్, వడ్డెన్న, ఎస్కే నసీర్, సంతోష్, పెద్దుల, ఎల్.గంగాధర్, సిద్ధ పోశెట్టి, సుదర్శన్ గౌడ్, మన్నె పోశెట్టితో పాటు పలువురు పాల్గొన్నారు.

నాకు న్యాయం చేయండి

- తనకు తెలియకుండా తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని అక్క పట్టా చేసుకుందని ఆవేదన

నవతెలంగాణ-కామారెడ్డి

తనకు తెలియకుండా తన తండ్రి పేరున ఉన్న భూమిలో తనకు రావాల్సిన వాటా భూమిని పట్టా చేసుకున్నారని దోమకొండ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన గొర్రె పద్మ వాపోయారు. సోమవారం ఆమె ప్రెస్‌క్లబ్ భవనంలో మీడియాతో మాట్లాడారు. లింగాపూర్ గ్రామంలో తన తండ్రి పడిగే నర్సయ్య పేరున సర్వేనెంబర్ 314/3/1లో 0.34 గుంటలు సర్వే నెంబర్ 315/7ఎలో 0.19 గుంటల భూమి ఉందని, తన తల్లి పడిగే మనెవ్వ మృతి చెంద డంతో తండ్రి పేరున ఉన్న భూమి తన అక్క లక్ష్మీ తన పే రున చేయాలని కుల సంఘంలో చెప్పారన్నారు. తల్లి డెత్ సర్టిఫికెట్ తమకు తెలియకుండా ఇవ్వవద్దని కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో చెప్పినా సర్టిఫికెట్ ఇవ్వడంతో తనకు తెలియకుండా తన వాటా భూమి కూడా తన అక్క పేరున మార్పిడి చేసుకుందన్నారు. తనకు తెలియకుండా పట్టా మార్పిడి ఎలా చేశారని తహసీల్దార్‌కు అడిగితే కోర్టుకు వెళ్లాలని ఉచిత సలహా ఇస్తున్నారన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినట్టు, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. జిల్లా కలెక్టర్ తనకు న్యాయం చేయాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు

వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

- మండల వ్యవసాయాధికారి అమర్ ప్రసాద్

నవతెలంగాణ-నిజాంసాగర్


వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని గోర్గల్ గ్రామంలో వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి పంటలో మొగి పురుగు ఉధృతి, జింక్ పోషక లోపం అధికంగా గమనించినట్టు తెలిపారు. జింక్ పోషక లోపం నివారణకు జింక్ సల్ఫేట్ మందు ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని రైతులకు సూచించినట్టు పేర్కొన్నారు. మొగి పురుగు నివారణకు వరి నాటిన 30 రోజుల వరకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి. గుళికలు ఎకరానికి 4 కిలోలు చల్లుకోవాలని, వరినాటిన 30 రోజుల తర్వాత మొగిపురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 50 ఇ.సి. ఎకరానికి 250 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ ఎకరానికి 60 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని రైతులకు సూచించినట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో మొగి పురుగు నివారణకు డ్రోన్ ద్వారా చేసే పిచికారీని సందర్శించినట్టు పేర్కొన్నారు. డ్రోన్ ద్వారా చేసే పిచికారీ వలన తక్కువ కష్టంతో, తక్కువ సమయంలో, తక్కువ నీటితో ఎక్కువ ఎకరాలు పిచికారీ చేసుకోవచ్చునని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి, రైతులు కాశాగౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ ద్వారా పిచికారీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

చిరుత దాడిలో పాడి దూడ మృత్యువాత

నవతెలంగాణ-లింగంపేట్



మండలంలోని బోనాల బంజారా తండా సమీపంలో మంగళవారం తెల్లవారుజామున పాడి దూడపై చిరుత దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. బంజారా తాండకు చెందిన పద్మావత్ దరియా పాడిదూడ తాండ సమీపంలోని వ్యవసాయ పంట పొలం పశువుల కొట్టం వద్ద రోజువారీగా అక్కడ కట్టేశారు. మంగళవారం ఉదయం అక్కడికి వెళ్లి చూడగా దూడ మృతి చెంది ఉండడంతో తాండవాసులకు సమాచారం అందించారు. తాండావాసులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం అటవీ శాఖ, పశు వైద్యాధికారులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న అధికారులు పంచనామా నిర్వహించి చిరుత దాడిలో మృత్యువాతపడినట్టు ధృవీకరించారు. చిరుత దాడి చేయడంతో గిరిజనులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తండా సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో రాత్రివేళ పంట పొలాల వద్దకు కాపాల వెళ్లాలంటే పశువుల కాపర్లు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు చిరుత సంచరించే ప్రదేశాలలో బోర్డులు ఏర్పాటు చేయాలని గిరిజనులను కాపాడాలని వారు కోరుతున్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

- ఆరుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామ శివారులో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామంలో వ్యక్తి మరణించగా దహన సంస్కారాల కోసం పెద్దమల్లారెడ్డి నుంచి కాచాపూర్‌కు ట్రాక్టర్‌పై కట్టెలను తీసుకువెళ్లే క్రమంలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా గాయాలైన వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జుక్కల్/పిట్లం/మద్నూర్

సామాజిక ఉద్యమ నేత మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం లభించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాదిగ ప్రజాప్రతినిధుల బృందంతో కలిసి మంగళవారం శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలని మెడికల్ అధికారి దివ్య ఆరోగ్య సిబ్బందికి తెలిపారు. మంగళవారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి మాట్లాడుతూ.. ఈ నెలలో నిర్వహించే నులిపురుగుల దినోత్సవం, అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. చిన్నారుల వ్యాక్సిన్ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటరమణ, మల్టీపర్పస్ సూపర్వైజర్ సువర్ణ, రాజమణి, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తిపై కేసు



తహసీల్దార్ ఎదుట బైండోవర్

నవతెలంగాణ-నిజాంసాగర్

డయల్ 100కు ఫోన్ చేసి అత్యవసర సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ గ్రామానికి చెందిన టెక్కలి నాగరాజు (33) సోమవారం రాత్రి మద్యం తాగి అనవసరంగా డయాల్ 100కు ఫోన్ చేసి అత్యవసర సేవలను దుర్వినియోగం పరిచినందుకు అతనిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. మళ్ళీ సేవలను దుర్వినియోగం చేయకుండా మహమ్మద్‌నగర్ మండల తహసీల్దార్ ఎదుట హాజరు పరచి సేవలను దుర్వినియోగం చేయకుండా రూ.లక్ష పూచీకత్తు చెల్లించే విధంగా బైండోవర్ చేసినట్టు ఆయన తెలిపారు. డయల్ 100ను ఎవరు దుర్వినియోగం చేయకుండా అత్యవసర సేవలను అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నూతన కమిషనర్‌ను కలిసిన మున్సిపల్ యూనియన్ (సిఐటీయు) నాయకులు



మున్సిపల్ కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న కార్మిక నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్‌కు కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్‌ను మున్సిపల్ కార్మికుల యూనియన్ (సిఐటియు) నాయకత్వం మంగళవారం మర్యాదపూర్వకంగా పూల మొక్కను అందజేసి కలిశారు. కామారెడ్డి మున్సిపల్‌కు కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని, మేనేజర్ రమేష్‌ను కలిసి పూల మొక్క ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం చెప్పారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కామారెడ్డి జిల్లా మున్సిపల్ యూనియన్ లీడర్స్ కమిషనర్‌కు నాలుగు నెలల ఈపీఎఫ్, ఈఎస్ఐతో పాటు ప్రతినెల 5న జీతాలు అందేవిధంగా చూడాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజనర్సు, జిల్లా కార్యదర్శి ఎండి మహబూబ్ అలీ, ఉపాధ్యక్షులు దీపక్, ప్రభాకర్, కాత్రియాల ప్రభు, దీవెన, శివరాజవ్వ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- దళారులకు అమ్ముకొని మోసపోకండి
- పీఏసీఎస్ సెక్రటరీ బాబురావు పటేల్



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సెక్రటరీ

నవతెలంగాణ-మద్నూర్

కంది కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సెక్రటరీ బాబురావు పటేల్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కంది పంటకు మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మార్కెట్ యార్డులో మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి జే బాబురావు పటేల్ మాట్లాడుతూ క్వింటాకు రూ.7550 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ స్వామ్యశ్రీ, మార్కెట్ కమిటీ సూపర్వైజర్ చందర్, సింగిల్ విండో సిబ్బంది విటల్, హమాలీ ముఖదం, రాములు రైతులు పాల్గొన్నారు.

'అద్దెకు ఆర్టీసీ బస్సులు' గోడప్రతులు విడుదల

నవతెలంగాణ-పిట్లం



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

మండల కేంద్రంలోని ఆర్టిసి ప్రయాణ ప్రాంగణం, పలు వివాహాది ఫంక్షన్ హాల్ ఆవరణలో ఆర్టీసీ అద్దె బస్సుల గోడ ప్రతులను స్థానిక కంట్రోలర్ సాయిలు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బాన్సువాడ డిపో మేనేజర్ సరితా దేవి ఆదేశానుసారం డిపో పరిధిలోని, ఇతరాత్రా మండల, గ్రామ, డివిజన్, జిల్లా ప్రజల వివాహాది శుభకార్యాలు, విజ్ఞాన విహారయాత్ర నిమిత్తం సురక్షిత సుఖవంతమైన ప్రయాణం కోసం సరసమైన అతి తక్కువ అద్దెతో ఆర్టీసీ బస్సులను ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సదావకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి సిబ్బంది, స్థానికులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత ప్రభుత్వం, కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్ జిల్లాల యువ ఎక్ఛేంజి కార్యక్రమం ఈ సంవత్సరం హైదరాబాదులో నిర్వహించనున్నారని జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన యువతి యువకులకు నైపుణ్య శిక్షణ, మానసిక, శారీరక ఉల్లాసం కోసం అన్ని రకాల ప్రత్యేక నిపుణులతో ఉచిత శిక్షణ ఇచ్చే ఈ కార్యక్రమం ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు 5 రోజులపాటు హైదరాబాదులో ఉంటుందని తెలిపారు. ఆసక్తిగలవారు తమ వివరాలను నెహ్రూ యువ కేంద్ర నిజామాబాదు వాట్సాప్ నెంబర్‌కు 9100435410 తెలియజేయాలని జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ తెలిపారు. ఎంపిక చేయబడిన 25 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి ఉచితంగా వసతి భోజనం శిక్షణలో ఉపయోగమయ్యే బూట్లు, టీ షర్టు, ఇతర నిత్యవసరాల కిట్టును అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం చివరిలో ప్రశంసా పత్రం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు

ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ యాదగిరి

- సంస్మరణ సభలో వక్తలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ యాదగిరి అని, ఆయనకు విప్లవ ఉద్యమ నిర్మాణంతో నివాళు లర్పిద్దామని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా అధ్యక్షులు సారా సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ బి.అశోక్ అధ్యక్షతన కామ్రేడ్ యాదిగిరి సంస్మరణ సభను నిర్వహించారు. సభలో జిల్లా నాయకులు సారా సురేష్, హసకొత్తూర్ మాజీ ఎంపీటీసీ జి. సత్యనారాయణ మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా కామ్రేడ్ యాదిగిరి ఐదు దశాబ్దాల కాలం కష్టనష్టాలకు, నిర్బంధాలను ఎదుర్కొని విప్లవోద్యమ నిర్మించాడని కొనియాడారు. విప్లవ ఉద్యమాన్ని నిర్మించి తన ఆశయాన్ని ముందు తీసుకుపోవడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో జి. కిషన్, వి.సత్యక్క, ఉట్నూరి బాలయ్య, బాలకిషన్, వి. ఆనంద్, సారా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారుల

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయిత్ నగర్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్టు అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిడిపిఓ భార్గవి ఆదేశానుసారం మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతంతో పాటు ఇతర పౌష్టికాహారాన్ని అందిస్తూ పిల్లల ఎదుగుదలకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గర్భిణీ, బాలింత మహిళలకు ఆరోగ్య విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఏ స్తేరు రాణి, చిన్నారుల తల్లులు ,తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీల ప్రక్షాళన జరిగేనా?

- సమీపిస్తున్న ఎన్నికలు
- ఏళ్లతరబడి డిప్యూటేషన్‌పై ఒకే స్థానంలో

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ అధికారులు రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి బదిలీ కావడం సర్వసాధారణం. అడ్మినిస్ట్రేషన్‌లో ఎలాంటి పక్షపాత ధోరణి ప్రదర్శించకుండా ఉండేందుకు బదిలీలు చేయడం అనేది తప్పనిసరి. ఏళ్ల తరబడి డిప్యుటేషన్‌పై ఒకే స్థానంలో ఉద్యోగులు కొనసాగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఏళ్ల తరబడి ఒకే చోట.....

పలు శాఖలలో క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చాలామంది అధికారులు ఎన్నో ఏళ్లుగా తిష్ట వేశారు. గత ప్రభుత్వంలో కొంతమంది అధికారులు జిల్లాల్లో పోస్టింగ్ పొంది ఇక్కడే పనిచేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత అధికార పార్టీ తమకు అనుకూలమైన అధికారులను జిల్లాకు బదిలీ చేయించుకున్నారు. కొందరు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తాము ఉన్న సీట్లను వదిలేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు కీలక అధికారులు 8 నుండి 10 ఏళ్లకు పైగా ఒకే చోట పని చేస్తుండడం గమనార్హం. క్షేత్రస్థాయి పర్యటనల పేరుతో తప్పుడు సమాచారం ఇస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

గత ఎన్నికల తర్వాత...

గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం కొలువుతీరిన నేపథ్యంలో సుదీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ప్రజలు కోరగా నియోజకవర్గంలోని నందిపేట్, డొంకేశ్వర్ ఎంపీడీవోతో పాటు, బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ వ్యవసాయ అధికారి, ముప్కాల్, మోర్తాడ్ ఎంపీడీవో, బాల్కొండ వ్యవసాయ అధికారి, జిల్లాలోని రుద్రూర్, కోటగిరి, ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. జిల్లాలోని మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో



ఇన్చార్జి అధికారి పాలనతో నెట్టుకొస్తున్నారు. రెగ్యులర్ మండల అధికారి కామారెడ్డి నుంచి రాగా జక్రాన్‌పల్లికి డిప్యూటేషన్‌పై వెళ్లారు.

డిప్యూటేషన్ ముగిసిన ఒకేస్థానంలో..

గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు బదిలీలు జరిగిన ఒకేచోట తిష్ట వేసిన వారిపై సర్కారు దృష్టి సారించాలి. కొత్త జిల్లాల విభజన, నూతన మండలాల ఏర్పాటు సమయంలో కొన్ని శాఖలలో బదిలీలు జరిగాయి. మరి కొంతమంది ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఎన్నోఏళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారు. ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారికి అనుకూలంగా ఉన్న వారిని డిప్యూటేషన్ ముగిసిన అదే స్థానంలో కొనసాగిస్తుండడం గమనార్హం. డివిజన్ కేంద్రంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కొన్నింటిలో బదిలీలు జరిగిన మరికొన్ని శాఖలపై క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు బదిలీలు జరిగిన ఒకే చోట తిష్టవేసిన వారిపై సర్కారు దృష్టి సారించాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు. కొత్త జిల్లాల విభజన సమయంలోను ఆర్డర్ టు సర్వ్ కింద సర్దుబాట్లు జరిగిన కొందరు ఒకేచోట ఉండిపోయారని గుర్తించింది. కొన్ని డిపార్ట్మెంట్లలో బదిలీలు జరిగిన మరికొంతమంది ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఏళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారు. ఆయాశాఖల జిల్లా ఉన్నతాధికారికి అనుకూలంగా ఉన్న వారిని డిప్యూటేషన్ ముగిసిన అదే స్థానంలో కొనసాగిస్తుండడం గమనార్హం.

సూపరింటెండెంట్ ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-మాక్లూర్



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

మండల కార్యాలయంలో సుపరింటెండెంట్‌గా విధు లు నిర్వహి స్తున్న లక్ష్మా రెడ్డి మంగళవారం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శులు, సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యంకోసం అవస్థలు

- రెండురోజులకే బియ్యం అయిపోయాయంటున్న డీలర్లు
- గ్రామంలోని షాపుల చుట్టూ తిరుగుతున్న లబ్దిదారులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని రేషన్ బియ్యంకోసం లబ్దిదారులు అవస్థలు పడుతున్నారు. ఒకటో తారీకు నుండి రేషన్ బియ్యం అందిస్తున్నారు. ప్రజలు రేషన్ బియ్యం కోసం ఒకటో తేదీ ఉదయం నుండే షాప్‌ల వద్ద వేచి ఉంటే గాని బియ్యం దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. రెండు రోజులు అనంతరం రేషన్ సరుకులు తీసుకుందామని ప్రజలు ఆలస్యం చేస్తే షాపుల్లో రేషన్ బియ్యం అయిపోయాయి తమ వద్ద లేవు అంటూ షాప్ డీలర్లు అంటున్నారు. ప్రజలు ఏ షాపులో రేషన్ బియ్యం ఉన్నాయో అంటూ గ్రామంలోని అన్ని షాపులకు వద్దకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మండల కేంద్రంలోని షాపు వద్ద సోమవారం ఉదయం రేషన్ బియ్యం కోసం పదుల సంఖ్యలో మహిళలు, పురుషులు నిలబడ్డారు. గ్రామ ప్రజలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తున్న ప్రతి లబ్దిదారుడికి ఎందుకు రేషన్ బియ్యం అందడం లేదో తెలియడం లేదు. అన్ని షాపుల వద్ద బియ్యం అయిపోయాయి అంటే మరి బియ్యం తీసుకోని లబ్దిదారుల పరిస్థితి ఏంటని అంటున్నారు. అధికారులు రేషన్ షాపులపై నిఘా



రేషన్‌షాపవద్ద క్యూకట్టిన లబ్దిదారులు

పెట్టి ప్రజలందరికీ రేషన్ సరుకులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుతున్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బిజెపి నిజామాబాద్ జిల్లా అధ్యక్షునిగా రెండవసారి కులచారి దినేష్ ను నియమించి నందున మంగళవారం ఢిల్లీలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురిని కలిసి శాలువ కప్పి పూలబొకేను అందించి ధన్యవాదాలు తెలిపారు. అనం తరం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు డా.కే లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కులాచారి దినేష్

పోలీస్ ఫోర్స్ గేమ్స్ మీట్‌లో

విగ్రహ ప్రతిష్ఠాపనకోసం భూమిపూజ



విగ్రహదాతను సన్మానిస్తున్న పలవురు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద మంగళవారం వసంత పంచమి పండుగను పురస్కరించుకుని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టపన కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ 12 అడుగుల విగ్రహ ఏర్పాటుకు రూ.2,50 లక్షల రూపాయలను విరాళంగా అందించారని గ్రామస్తులు తెలిపారు. అనంతరం గ్రామస్తులు విగ్రహ దాతను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఉప సర్పంచ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

8న సాంస్కృతిక కార్యక్రమం

నవతెలంగాణ-కంఠేశ్వర్

న్యూ క్రియేటివ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో కల్చరల్ నైట్ ఫుల్ ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాన్ని సుభాష్ నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 8న నిర్వహిస్తున్నట్టు ఈవెంట్ మేనేజ్మెంట్ సభ్యులు తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ఆవరణలో న్యూ క్రియేటివ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో డాన్స్, సింగింగ్, మిమిక్రి, వినుత్నమైన ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాలొనాలంటే ఈవెంట్ పాస్‌లు కొనుగోలు చేయవలసి ఉంటుందని, అతి తక్కువ ధరకే కేవలం ఒక పాస్ మీద



మాట్లాడుతున్న ఈవెంట్ సభ్యులు

నలుగురు ఫ్యామిలీగా రావొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజ్మెంట్ క్రాంతి, చందు, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రిన్సిపల్ జోస్ థామస్, సురేష్ గౌడ్, సాయిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

9 సెల్ ఫోన్ల రికవరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఆరవ టౌన్ పోలీసులు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో భాదితులు పోగొట్టుకున్న తొమ్మిది సెల్ పోన్ లను రికవరీ చేశారు. మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ ఓ వెంకట్రావు సంబంధిత సెల్ పోన్ లను బాధితులకు అందచేశారు. ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ యాస్మీన్ సిఇఐఆర్ పోర్టల్ యాప్ ద్వార 9 సెల్ పోన్ లను రికవరీ చేయడం పట్ల అధికారులు అభినందించారు

రుచికరమైన భోజనాన్ని అందించాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను, వారి పనితీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు బాగా చదివి సన్నద్ధం కావాలని, మంచి గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించడం ద్వారా పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రమైన వాతావరణంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాల కు వచ్చిన సరుకులను పరిశీలించారు. సరుకుల్లో నాణ్యత లేకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. భోజనం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

పద్మశ్రీ మందకృష్ణ సబ్బండ కులాల నాయకుడు

- 80 దప్పులు అందజేసిన గోర్త రాజేందర్



దప్పులు అందజేసిన గోర్తరాజేందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 7న జరగబోయే వేల గొంతులు లక్షల డప్పులు భారీ సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చెయ్యడంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్త రాజేందర్ 80 డప్పులు మాదిగ కుల సంఘాలకు ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డొనేట్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ పాల్గొన్నారు.

ఈ గోర్త రాజేందర్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ మాదిగలకు ఒక్కరికే నాయకుడు కదాని, ఆయన సబ్బండ కులాల నాయకుడని అన్నారు. ఈ మండలంలో మాదిగ సమాజానికి ఏ అవసరం ఉన్న అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే మంద కృష్ణ మాదిగ కి పద్మశ్రీ రావడం అంటే సమాజంలో సబ్బండ కులాలకు దక్కిన గౌరవం అని అన్నార.

కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7 నాడు జరిగే వేల గొంతులు లక్షల డప్పులు కార్యక్రమం ఆరు నూరైనా జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వేలాదిగా డప్పులతో కదిలి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా నాయకులు మైలరాం బాలు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం రాజేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జక్రాన్‌పల్లి మండల అధ్యక్షులు వేల్పుల వరుణ్ మాదిగ, ఎంఎస్పి జక్రాన్‌పల్లి మండల అధ్యక్షులు నల్ల సాయన్న మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కనక శ్రీదీప్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు రాములు, మాదిగ కళ మండలి నాయకులు, కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. నీలకంఠుని రథోత్సవం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాకేంద్రంలోగల నీలకంఠేశ్వర ఆలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రథంపై నీలకంఠేశ్వర స్వామిని ఊరేగించారు. భక్తుల కోలాటాలు, భజనల మధ్య రథోత్సవం కొనసాగింది. ఆలయంనుంచి తల్లిగోరి వరకు రథం ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావచ్చారు. భక్తులు రథానికి పూలతొట్లెలు కట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సందర్భంగా జాతర కొనసాగింది. ఈసందర్భంగా తినుబండారాలు, బొమ్మల దుకాణాలు ఏర్పాటుచేశారు.

క్యాన్సర్‌ను జయించిన మాజీ ఎంపీటీసీకి సన్మానం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

23 లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో మంగళవారం "వరల్డ్ క్యాన్సర్ డే" సందర్భంగా మండలంలోని పడగల్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ వెలమల గంగామణి క్యాన్సర్‌తో పోరాడి జయించడంతో ఆమెనున సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు చేరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణ గౌడ్, చెన్న రవి, విజయనంద్, ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ మీసాల సురేష్ కుమార్, దయశీల్, పుణ్యరాజ్, రామగౌడ్ పాల్గొన్నారు.



గంగామణిని సన్మానిస్తున్న పలువురు

వరిలో నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన

- రైతులకు ఉచితంగా ఏడబ్ల్యుడి పైపులు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరి పంటలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి శృతి మాట్లాడుతూ.. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ చింత శ్రీనివాస్, డిఎస్ఆర్ పద్ధతి, తడి పొడి విధానం, డ్రమ్ సీడర్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో వరి సాగు చేసి ఆదాయం పెంచుకోవచ్చు అన్నారు. వరి సాగులో కూలీల కొరతను అధిగమించడానికి ఈ పద్ధతులు అవలంభించాలని తెలిపారు. వరి సాగులో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులు అమలు చేసుకోవాలన్నారు. వరిలో



పైపులు అందజేస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

కలుపుకు తొలగించిన తర్వాత పొట్ట దశ వచ్చే సమయం వరకు ఎక్కువ నీరు అవసరం ఉండదని, కేవలం 45 తడులతో తడి పొడి విధానం పాటించి సాగు చేయవచ్చని సూచించారు. ఈ విధానంలో 30 సెంటీమీటర్ల ఎడబ్ల్యుడి పైపును 15 సెంటీమీటర్ల వరకు, రెండు సెంటీమీటర్ల ఎడంలో రంధ్రాలు చేసుకొని జల్లెడ మాదిరి తయారు చేసుకుని పొలం గట్టు అమర్చుకోవాలన్నారు. ఈ పద్ధతి పాటిస్తే నీటి వృధాను అరికట్టడంతో పాటు వరి పంట నుండి వెలువడే మీథేన్ వాయు వల్ల కలిగే గ్లోబల్ వార్మింగ్ ని తగ్గించి, 15 నుంచి 30శాతం దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఏడబ్ల్యుడి పైపులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు తిరుమల, సాయిరాం రాజ్, ప్రశాంత్, షబ్బీర్, స్నేహ శ్రీ, రైతులు హరికిషన్, గంగారాం, వెంకటేష్, మహేష్, శ్రీనివాస్, సురేష్, వీరేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొమ్మకో కొంగ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఓ ఎండిన చెట్టుపై కొంగలు వాలాయి. వీటిని చూస్తుంటే కొమ్మ కొమ్మకో పూవులా కనిపిస్తున్నాయి. అటుగా వెళ్తున్న వారు ఈ కొంగలు వాలిన చెట్టును చూసి మంత్ర ముగ్ధులవుతున్నారు.



మాజీ సర్పంచుల అరెస్టులు

నవతెలంగాణ- ఆర్మూర్.

మండల బీఆర్ఎస్ తాజా మాజీ సర్పంచులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సర్పంచులు బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదని తాజా మాజీ సర్పంచులు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో అంకాపూర్ కిషోర్, ఆలూరు మోహన్ రెడ్డి, దేగాం గంగారెడ్డి, పిప్రి శ్రీనివాస్ రెడ్డి, రాంపూర్ దయానంద్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న జూల రుకుంబాయికి రూ.16వేలు, యేషాల లింగంకు 60 వేలు, జైనోద్దీన్‌కు రూ.13,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంగళవారం అందజేసినట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దమ్మాయి శ్రీను, ఐసుబ్, కాంతం చిన్నయ్య, హైమద్, జమీల్, యడ్డిగారి నిఖిల్,సందీప్,మేర శ్రీను,కాల భోజన్ననడికూడ భూమన్న, సాకలి గంగన్న, జూల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

సత్తా చాటిన జిల్లాక్రీడాకారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర 3వ పోలీస్ స్పోర్ట్స్అండ్ గేమ్స్ మీట్- 2025 కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ మీట్ లో బాసర జోన్-2, తరపున నిజామాబాద్ క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ రంగాలలో 61మంది క్రీడాకారులు పాల్గొని, 26 పతకాలు సాధించారు. క్రీడాకారులను నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సి. హెచ్.సింధు శర్మ-ఐపీఎస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, అడిషనల్ డీసీపీ (ఏఆర్) కె. రామ్ చందర్ రావ్, స్పెషల్ బాంచ్ ఏసిపి, శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు హెచ్ .సతీష్(అడ్మిన్), యు. తిరుపతి (ఎంటిఓ), కె. శ్రీనివాస్ (వెల్ఫేర్), శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దోమకొండ మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన భూపతి (50) గత రెండు సంవత్సరాలుగా తన అత్తగారి ఇల్లు అయిన జంగంపల్లి గ్రామంలో పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం స్థానికులు జంగంపల్లి చెరువు వద్ద ఆత్మహత్య చేసుకున్న భూపతిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని చెరువుల నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

బెల్టుషాపులో మద్యం తాగుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-ధర్పల్లి



బెల్ట్‌షాపులో మద్యం సేవిస్తూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రామడుగు ప్రాజెక్టు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మొయినొద్దీన్ (55) మంగళవారం స్థానికంగా ఉన్న బెల్ట్‌షాపులోకి రాత్రి 8 గంటలకు మద్యం సేవించేందుకు వెళ్లాడు. కాగా అక్కడ మద్యం సేవిస్తుండగానే మృతిచెందాడు. మృతుడు డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఓ ప్రయివేటు పాఠశాల బస్సు నడుపుతున్నట్లు సమాచారం. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపుల వెలుస్తూ మద్యం ఏరులై పారిస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాల మీదకు వస్తున్నట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంఘటన స్థలానికి ఎస్ ఐ రామకృష్ణ చేరుకొని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. కాగా కల్తీ మద్యం వలన మృతిచెందాడా..? లేక ఇతర కారణాల అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.

రైతులకు సహకారం

- పాలకవర్గం ప్రత్యేక చొరవతో లాభాల బాట
- కల్యాణ మండపం నిర్మాణం
- ఆదర్శంగా నిలుస్తున్న అచ్చంపేట్ సహకార సంఘం

నవతెలంగాణ-నిజాంసాగర్

ఐదు సంవత్సరాలుగా కర్షకుల సేవలో తరిస్తోంది. వారికి భరోసా కల్పిస్తోంది. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తోంది. పాలకవర్గం ప్రత్యేక చొరవతో సంఘం లాభాల బాటపట్టింది. ఈ క్రమంలోనే సొంత భవనం ఉండడంతో పాటు కళ్యాణ మండపాన్ని నిర్మాణం చేపట్టి.. ఆదర్శంగా నిలుస్తోంది.. నిజాంసాగర్ మండల కేంద్రంలోని అచ్చంపేట్ సహకార సంఘం.

ఈ సంఘం పరిధిలోని గ్రామాలకు చెందిన 3000 మంది రైతులకు సేవలందిస్తోంది. 730 మంది రైతులు సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నారు. సంఘం ద్వారా గత ఐదు సంవత్సరాల నుంచి ఇప్పటివరకు స్వల్ప కాలిక రుణాలు, దీర్ఘకాలిక రూ.4,44,12,000 రుణాలను రైతులకు సంఘం ద్వారా ఇప్పటివరకు అందజేశారు.

పాలకవర్గం ప్రత్యేక చొరవ..

అచ్చంపేట సహకార సంఘానికి చెందిన కయ్యం నరసింహారెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన హయాంలోనే పాలకవర్గం ప్రత్యేకంగా కృషి చేసి వివిధ వ్యాపారాలు నిర్వహించారు. రైతులకు అపారమైన ఎరువులు, విత్తనాలను అందిస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధర అందిస్తున్నారు. కమీషన్ రూపకంగా వచ్చిన డబ్బులతో సంఘం ఆర్థికంగా బలపడుతుంది. సొసైటీలో పనిచేస్తున్న సిబ్బందికి లాభాల నుంచి వేతనాలు అందిస్తున్నారు.



సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపం

కోటి రూపాయలతో కళ్యాణం మండపం..

సంఘానికి వచ్చిన లాభాల నుంచి సంఘం పరిధిలోని ప్రజలందరికీ ఉపయోగపడేలా నేషనల్ హైవే నుంచి నిజాంసాగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన గొర్గల్ గేట్‌కు కళ్యాణ మండపాన్ని నూతనంగా నిర్మాణం చేపట్టారు. సహకార సంఘం భవనంలోనే డిసిసి బ్యాంక్ ఏర్పాటు చేశారు. దాని నుంచి సంఘానికి కిరాయి రూపంలో ఆదాయం వస్తుంది. నిజాంసాగర్‌లో 500 మెట్రిక్ టన్ను గోదాంతో పాటు, అచ్చంపేట్‌లో 100 మెట్రిక్ టన్నుల గోదాం, నర్సింగ్‌రావుపల్లి నేషనల్ హైవే పక్కన 250 మెట్రిక్ టన్నుల గోదాం సంఘం పరిధిలో ఉన్నాయి.

లాభాల బాటలో..



సహకార సంఘానికి ఆదాయం పెంచే విధంగా కళ్యాణ మండపాన్ని నిర్మించాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నాం. పాలకవర్గ సభ్యుల సహకారంతో సంఘం లాభాల బాటలో పయనిస్తోంది. పాలకవర్గ సభ్యుల సహకారంతో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. కళ్యాణ మండపంతో వచ్చిన ఆదాయంతో భవిష్యత్తులో సంఘం అభివృద్ధి కోసం వివిధ గ్రామాలలో స్థలాల సేకరణ కోసం కార్యచరణ రూపొందించాం. **- కయ్యం నరసింహారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు అచ్చంపేట్.**

ఆదుకునేవారు ఉండరని వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి

తనను ఆదుకునేవారు లేరని పురుగుల మందుతాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నందివాడ తండాలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నందివాడతాండకు చెందిన బర్మావత్ చందర్ (60) తన భార్య సంగీయ క్యాన్సర్ వ్యాధితో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా.. తన భార్య మృతిచెందితే తనకు సేవ చేసేవారు ఉండరని చందర్ జనవరి 29న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. ఇదిలా ఉండగా.. మృతుని భార్య సంగీయా సైతం ఫిబ్రవరి ఒకటో తేదీన మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

కారుబోల్తా.. పలువురికి గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై భిక్కనూరు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూర్ పట్టణానికి చెందిన సంతోష్ కామారెడ్డికి కారులో వెళ్తుండగా ఒక్కసారిగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. స్థానికులు గమనించి కారులో నుంచి గాయాలైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.

చలో హైదరాబాద్ గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం లక్ష డప్పులు వేల గొంతులు చలో హైదరాబాద్ గోడ ప్రతులను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండలాధ్యక్షులు నెల్లూరి గంగారాం చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. మండల కోశాధికారి మన్నే బాలయ్య, జిల్లా నాయకులు లేగ్గల రాజు, భూపాతి, సంగమేశ్వర్, రాజు, పోచయ్య, వెంకట్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సమస్యలు గుర్తించనున్నట్టు మండల ప్రత్యేకాధికారి జ్యోతి తెలిపారు. మండలంలోని సీతారాంపల్లి, సంగమేశ్వర్, అంబారిపేట్ గ్రామంలో ఎంపిడివో, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పై అధికారులకు నివేదించడం జరిగిందని తెలిపారు. వేసవి రాకముందే, సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, ఏఈలు శిరీష, వంశీ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో ఇందిరమ్మ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ కేంద్రంపై ఫిర్యాదులు రావడంతో ఆయన కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్ మంజులను ఆదేశించారు. గత రెండు సంవత్సరాలుగా తమ కేంద్రంలో ఆయా పోస్టు ఖాళీ ఉండడంతో తానే కేంద్రాన్ని నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గుడ్లను ఆయన పరిశీలించారు. చిన్నారులకు ప్రతిరోజు గుడ్లను అందించాలని అన్నారు. ప్రతిరోజు చిన్నారులను కేంద్రానికి తీసుకువచ్చి పోషకాహారం అందించాలన్నారు. ఆయన వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులున్నారు.

పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

రాజంపేట్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యుల సూచనలు సలహాలు పాటించి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వైద్యులు ఐశ్వర్య, హెల్త్ సూపర్వైజర్ మంజూరు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సిడిసి చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కమలాకర్ రావు మంగళవారం సిడిసి చైర్మన్ ఇర్షాదుద్దీన్‌ను శాలువాతో సన్మానించారు. ఇటీవల చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో అడ్లూరు ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ గాదారి శ్రీనివాస్ రెడ్డి, రుపేందర్‌రెడ్డి, కోతి దేవారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సమావేశానికి ఒకే ఒక్కడు

నవతెలంగాణ-వర్ని(చందూర్)



సమావేశానికి హాజరైన నన్నేసాబ్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఓటరు జాబితాపై రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశాన్ని ఎంపీడీవో నీలావతి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పలు పార్టీల ప్రతినిధులను ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తమ అభిప్రాయాలు తెలియచేయాలని సోమవారం ఎంపీడీఓ సమాచారం ఇవ్వగా.. మంగళవారం నిర్వహించిన సమావేశానికి మాత్రం సీపీఐ(ఎం) ప్రతినిధిగా ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ హాజరయ్యారు. దీంతో ప్రజల పక్షం ఒకే ఒక్క నేతగా.. పలువురు అభివర్ణించారు. ఎన్నికలు వస్తే హడావిడి చేసే నేతలు.. సమావేశాలకు రాకపోవడంపై ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ఎస్సి వర్గీకరణపై మంత్రివర్గ సమావేశంలో ఎస్సి వర్గీకరణపై చర్చించి వర్గీకరణను ఆమోదించబోతుండడంతో మాల మహానాడు నాయకులు ఆందోళన చేపట్టే అవకాశం ఉండడం, వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపడతారనే సమాచారంతో బోధన్ పట్టణ పోలీసులు మంగళవారం అడ్డుకొంటారనే మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు అనాంపల్లి ఎల్లయ్య, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి, బోధన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దేవేందర్, బోధన్ డివిజన్ ఉపాధ్యక్షులు కారం స్వామి, డివిజన్ నాయకులు యాదగిరి, సుభాష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, వీఆర్‌ఏల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ-బోధన్

గత ప్రభుత్వ హయాంలో చేసిన పనుల బిల్లులు మంజూరి చేయాలని కోరుతూ మాజీ సర్పంచులు తమ డిమాండ్లను పరిష్కరించాలని వీఆర్‌ఏల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపు నివ్వడంతో బోధన్ రూరల్ పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచులను, వీఆర్‌ఏలను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సుదర్శన్, తారాచంద్, సాయిలు తదితరులున్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీలక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల 5 బుధవారం నుంచి 13 వరకు ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి గింజుపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు తెలిపారు. ఇందులో భాగంగా 5 నుంచి 7 వరకు జాతర ఉత్సవాల్లో భాగంగా అధ్యయనం ద్రావిడ ప్రసాదం పారాయణం కార్యక్రమాలను ఆలయంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-పోతంగల్

పోతంగల్, కోటగిరి మండలాల్లో 39 సంవత్సరాల రెండు నెలల పాటు ఉపాధ్యాయుడిగా సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఆయనను మంగళవారం, పి.ఆర్.టి.యు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆయన వికలాంగుడైనప్పటికీ.. కష్టపడి అవిశ్రాంతంగా పనిచేశారని తెలిపారు. నిరంతరం విద్యార్థులకు సేవ చేస్తూ వారి హృదయాల్లో నిలిచిపోయారని వారు కొనియాడారు. కార్యక్రమంలో కోటగిరి, పోతంగల్ ఎంఈఓలు, పి.ఆర్.టి.యు నాయకులు, మండల అధ్యక్షులు బర్ల సాయిలు, వినోద్, కిరణ్, కె.గంగాధర్ పాల్గొన్నారు.

ఇసుక డంపులు గుర్తింపు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారులో అక్రమ ఇసుక డంపులను తహసిల్దార్ శ్రవణ్ కుమార్ గుర్తించి సీజ్ చేశారు. హంగర్గ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 20 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను రోడ్డుకు ఇరువైపులా డంపులు వేయడంతో వాటిని గుర్తించి సిబ్బందికి అప్పగించారు. బోధన్ రూరల్ సిఐ విజయబాబు ఆదేశాల మేరకు పోలీసులు సైతం తహసీల్దార్‌తో ఘటనా స్థలానికి వెళ్లారు. ప్రభుత్వం గుర్తించిన పనులకు ఈ ఇసుకను సరఫరా చేయడానికి రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచారు.

అటవీ భూములను కబ్జాచేస్తే చర్యలు

- ఎఫ్‌డీవో రామకృష్ణ
- ఫారెస్ట్ అధికారిపై ఇటీవల దాడి నేపథ్యంలో పోలీసుల బలగాల మధ్య కందకాలు తవ్వకం

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

అటవీ భూములను కబ్జా చేసినా, అటవీ శాఖ అధికారులపై దాడులు చేసినా శాఖపరమైన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో రామకృష్ణ హెచ్చరించారు. గత కొన్ని రోజుల క్రితం రాజంపేట్ మండలంలోని షేర్ శంకర్ తండా గ్రామంలోని కొందరు వ్యక్తులు సమీపంలోని అటవీ ప్రాంతంలో బోరు వేసి, చదును చేయడంతో విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు అటవీ ప్రాంతానికి చేరుకోగా గ్రామంలోని కొందరు వ్యక్తులు ఫారెస్ట్ అధికారులపై దాడులు చేశారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఫారెస్ట్ అధికారులు, పోలీస్ బలగాల మధ్య షేర్ శంకర్ తండా సమీపంలోని అటవీ ప్రాంతంలోకి ఎవరు వెళ్లకుండా, అటవీ ప్రాంతాన్ని కబ్జా చేయకుండా జెసిబిల సహాయంతో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో కందకాలు తీశారు. ఫారెస్ట్ అధికారులపై జరిగిన దాడులను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీసుల కవాతు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై పుష్పరాజ్, ఎఫ్ఆర్‌వో రమేష్, సంతోష్, ఓంకార్, వాసుదేవ్, ఎఫ్ఎస్ఓ సయ్యద్ బాబా, బీట్ ఆఫీసర్లు, భారీ పోలీసు బలగాలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కందకాలు తవ్వుతున్న దృశ్యం

పన్నుల వసూలు పూర్తి చేయాలి

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో పన్నుల వసూలు వందశాతం త్వరగా పూర్తిచేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బోధన్ పట్టణంలో కొనసాగుతున్న నీటి, ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని మంగళవారం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో పన్నుల వసూలులో పర్యటిస్తున్న సిబ్బందితో మాట్లాడి రోజువారీ వసూలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. పన్నుల వసూలు కోసం వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి తమ తమ బకాయిలను సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. పట్టణ అభివృద్ధి కోసం పన్నుల వసూలు చాలా అవసరమని, సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి, ఇంటి పన్నుల వసూలును సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



పన్ను వసూళ్లపై సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్

మొక్కలు వాడిపోకుండా చూడాలి

- డిఆర్‌డిఓ పిడి సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

ఎండలు సమీపిస్తున్న నేపథ్యంలో నర్సరీలో మొక్కలు వాడిపోకుండా చూడాలని డిఆర్‌డిఓ పిడి సురేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని మోతె గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. నర్సరీలో ఏ మొక్కలు నాటుతున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రం కావడంతో నర్సరీలో మొక్కలు వాడిపోకుండా చూసే బాధ్యత క్షేత్ర సహాయకులదేనని అన్నారు. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పట్టాలన్నారు. నర్సరీ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీఓ మలహరి, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు రాజు క్షేత్ర సహాయకులు సిబ్బంది ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మరణాలను తగ్గించొచ్చు

- అంకాలజిస్ట్ స్నేహసాగర్
- ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మరణాలను తగ్గించవచ్చని అంకాలజిస్ట్ స్నేహసాగర్ సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన అంకాలజిస్ట్ స్నేహసాగర్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐఎంఏ కామారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా.స్నేహసాగర్ మాట్లాడుతూ.. స్త్రీలలో 45 సంవత్సరాల తర్వాత ప్రతి సంవత్సరం మమోగ్రామ్, 21 సంవత్సరాల తర్వాత ప్రతి 3 సంవత్సరాలకు పీఏపీ స్మెర్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంలో సహాయపడుతుందన్నారు. రొమ్ముల్లో ఏదైనా గడ్డ కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని యువతులకు సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాధా రమణ మాట్లాడుతూ.. ధూమపానం మద్యపానం మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాబట్టి వాటికి దూరంగా ఉండటం మంచిదన్నారు. ఐఎంఏ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద్, డాక్టర్, కృపా మాట్లాడుతూ వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం, వ్యాయామం చేస్తూ కల్తీ వస్తువులు వాడకుండా మంచి అలవాట్లు ఉంటే రోగ నిరోధక శక్తితో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. తద్వారా మంచి రోగనిరోధక శక్తిని కలిగి ఉంటే క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. సీనియర్ డాక్టర్, ఐఎంఎ సభ్యులు పుట్ట మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఆరోగ్యం అంటే శారీరకంగానే కాదు మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఉండటమే అన్నారు. డిగ్రీ కాలేజీలో పాత విద్యార్థి కావడంతో ఆయనకు పెద్దఎత్తున చప్పట్లు కొడుతూ అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఇంటి ఆహారం ప్రాముఖ్యత గురించి నొక్కిచెప్పారు. మద్యం బాటిళ్లపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అది ఆరోగ్యానికి ప్రమాదకరమని సూచిస్తున్నారని దాన్ని చూసి అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పించేందుకు అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్ విజయ్, మహిళా సాధికారత సెల్ ఇంచార్జి శ్రీవల్లికి ధన్యవాదాలు తెలిపారు.

అర్ధరాత్రి ఆగని అక్రమ ఇసుక రవాణా

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో 2వ వంతెన ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి, అనుమతి లేకుండా 3 అక్రమ ఇసుక ట్రాక్టర్లను రవాణా చేస్తుండగా పట్టుకుని చర్యల నిమిత్తం కోటగిరి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు.

బైక్ దహనం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని నందివాడలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనానికి నిప్పంటించి దహనం చేసినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. గ్రామానికి చెందిన మాడి సత్యంకు చెందిన ఫ్యాషన్ ప్రో వాహనాన్ని సోమవారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి ఖాళీ బూడిదైంది. అతనికి గిట్టనివారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని గ్రామస్తులు తెలిపారు.

తెలంగాణ చెరువులపై మహారాష్ట్ర దాదాగిరి

- అడ్డుకోవాలని తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

నవతెలంగాణ-మద్నూర్

మహారాష్ట్రకు పూర్తిగా సరిహద్దులోని తెలంగాణ ప్రాంతంలో చెరువుల మట్టిపై మహారాష్ట్ర వాసుల దాదాగిరి కొనసాగుతున్నదని మద్నూర్ మండలంలోని అవల్‌గావ్ గ్రామస్తులు మంగళవారం మద్నూర్ తహసిల్దార్ ఎండి ముజీబ్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 261 సర్వేనెంబర్ చెరువులో నుంచి మట్టిని మహారాష్ట్రకు తరలిపోతుందని.. తరలించే వాటిని అడ్డుకుంటే దాడులకు ప్రయత్నం చేస్తున్నారని మహారాష్ట్ర వాసుల దాదాగిరి పట్ల తహసిల్దార్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెరువు మట్టి అక్రమంగా మహారాష్ట్రకు తరలిపోతున్నట్లు మట్టి మహారాష్ట్రకు తరలిపోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదుపై తహసీల్దార్ వెంటనే స్పందించి మాట్లాడుతూ.. మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL COURT JUDGE, NIZAMABAD DISTRICT, AT: NIZAMABAD
O.S.No.358 of 2024

Between:
DODDILA Manjula Jallapuram Manjula & others
...Plaintiffs
AND
Jallapuram Chinna Narayana & others
...Defendants

To
Jallapuram Suresh, S/o. Jallapuram Chinna Narayana, aged about 43 years, Occ: Farmer, R/o. H.No.2-84/3, Mallaram, Nizamabad Rural, Nizamabad, Telangana.
...Defendant No.2

NOTICE

It is submitted that the Plaintiffs have filed the above Suit under Order VII, Rule 1 & 2, R/W. Sec. 26 of Civil Procedure Code for Partition and Separate Possession. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above Suit and the matter is posted on 24-02-2025 at 10.30 am. Therefore you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence this Notice.

//BY ORDER OF THE HON'B LE COURT//
M/s.MANNE SANTHOSH, Advocate
Off: No.2-4-125/M/27, Sri Sri Nagar
Mallikarjuna Nagar, Road No.5
Uppal, Medchal-Malkajgiri District
Cell: 9959991048